సాక్షి
కర్నూలు
శుక్రవారం । 30 । ఆగస్టు । 2024



వేంపెంటలో ప్రబలిన అతిసారం

పాములపాడు మండలంలోని వేంపెంటలో అతిసార వ్యాధి ప్రబలి గురువారం 12 మంది మంచంపట్టారు. విషయం తెలుసుకున్న వైద్య సిబ్బంది మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. 8లో▸



బంగారు పల్లకీ సేవ

మంత్రాలయం: శ్రీమఠంలో రాయరు బృందావన ప్రతిమకు పూజలు నిర్వహించి స్వర్ణ పల్లకీలో ఆశీనులు చేశారు. అశేష భక్తజనం మధ్య పల్లకీ సేవ శ్రీమఠం ప్రాంగణ వీధుల్లో సాగింది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తిమట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,629.45
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	: 92
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 30,919
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	:9,843

న్యూస్‌రీల్

శ్రీమఠంలో భక్తుల రద్దీ



శ్రీమఠం ప్రాంగణ వీధుల్లో భక్తుల సందడి

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠం భక్తుల సందడితో కనువిందు చేసింది. గురువారం రాఘవేంద్రుల దర్శనార్థం వేలాదిగా తరలివచ్చారు. దీంతో తుంగభద్ర నదీ తీరం కోలాహలంగా కనిపించింది. గ్రామ దేవత మంచాలమ్మ, రాఘవేంద్రుల దర్శన క్యూలైన్లు కిక్కిరిశాయి. స్వామి దర్శనానికి గంటన్నర సమయం పట్టింది. పరిమళ ప్రసాదం, అన్నపూర్ణ భోజనశాల, సేవా కౌంటర్లు భక్తులతో రద్దీగా దర్శనమిచ్చాయి. వ్యాపార సముదాయాలు, హోటళ్లు కిటకిటలాడాయి. శ్రీమఠం మేనేజర్లు శ్రీనివాసరావు, శ్రీపతి ఆచార్, ధార్మిక సహాయక అధికారి వ్యాసరాజాచార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

3 నుంచి 'పొలం పిలుస్తోంది'

కర్నూలు(అగ్రికల్చర్): పొలం పిలుస్తోంది కార్యక్రమం సెప్టెంబర్ 3 నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు వ్యవసాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఖరీఫ్ సీజన్ ముగిసే వరకు వారంలో రెండు రోజుల(ప్రతి మంగళ, బుధవారం) పాటు ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. వ్యవసాయ అధికారులతో పాటు వెటర్నరీ, హార్టికల్చర్, యూనివర్సిటీలు, ఐటీడీఏ, ఫిషరీస్ అధికారులు కూడా ఇందులో పాల్గొంచుకోనున్నారు. వ్యవసాయ అనుబంధ శాఖలు అమలు చేస్తున్న పథకాలపై రైతులకు అవగాహన కల్పించడం, పంటలను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించనున్నారు. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం 2023–24 వరకు పెద్ద ఎత్తున పొలంబడి కార్యక్రమాలు నిర్వహించగా.. ప్రస్తుత ప్రభుత్వం పొలం పిలుస్తోంది పేరిట మండలానికి ఒక కార్యక్రమానికే పరిమితం చేయడం గమనార్హం.

ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి



జాతీయ క్రీడా దినోత్సవ ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్): హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తి తీసుకుని క్రీడల్లో విజయాలు సాధించాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పిలుపు నిచ్చారు. ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా గురువారం స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియం నుంచి జాతీయ క్రీడా దినోత్సవ ర్యాలీని ఎంపీతో పాటు జేసీ బి. నవ్య, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అలాగే ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, జిల్లా పరిషత్తు సీఈఓ నాసర రెడ్డి, సెట్కూర్ సీఈఓ పీవీ రమణ, ఒలింపిక్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

చిప్పగిరిలో అత్యధిక వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం వరకు 16 మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. అత్యధికంగా చిప్పగిరిలో 38.4 మి.మీ వర్షపాతం నమోదైంది. కోసిగి, పెద్దకడుబూరు, ఆదోని, హొళగుంద, మద్దికెర, ఆలూరు, హాలహర్వి తదితర మండలాల్లో తేలికపాటి వర్షాలు కురిశాయి. ఆగస్టు నెలకు సంబంధించి చిప్పగిరి మండలంలో అత్యధికంగా వర్షం కురిసింది. చిప్పగిరి మండలం సాధారణ వర్షపాతం 89.5 మి.మీ ఉండగా రికార్డు స్థాయిలో 420.6 మి.మీ వర్షపాతం నమోదైంది. ఆగస్టు నెల జిల్లా సాధారణ వర్షపాతం 116.2 మి.మీ ఉండగా 175.9 మి.మీ వర్షం కురిసింది.

కవులకు 'వంద'నం



వంద మంది తెలుగు కవుల చిత్రపటాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు


హొళగుంద: తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం హొళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు 100 మంది ప్రసిద్ధ తెలుగు కవుల చిత్రపటాలను ప్రదర్శించారు. కవులు గొప్పతనం గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నజీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

➤ దేవనకొండ మండలంలోని నేలతలమర్రి గ్రామానికి చెందిన బి. చంద్ర తన కోళ్లు, పొట్టేళ్లను పిచ్చికుక్క చంపుతోందని తెలుసుకున్నాడు. బుధవారం ఆ కుక్కను కర్రతో వెంబడించి అది మీదకు రావడంతో భయంతో పరిగెత్తడంతో ఆయన గుండెకొట్టుకోవడం ఆగిపోయి మరణించాడు.

➤ కర్నూలు నగరానికి చెందిన సూర్యనారాయణ ఎప్పటిలాగేనే వారం రోజుల క్రితం వాకింగ్‌కు వెళ్లి తిరిగి వస్తూ వార్మప్ ఎక్సర్‌సైజ్ చేయసాగాడు. ఇదే సమయంలో ఆయనకు తీవ్ర గుండెపోటు రావడంతో మరణించాడు.

➤ కర్నూలు నగరంలోని ఎన్‌ఆర్ పేటకు చెందిన మహబూబ్‌బాష ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇటీవల అతను యోగా క్లాసులకు వెళ్లి వచ్చిన అనంతరం కుర్చీలో కూర్చున్న అతనికి ఉన్నఫలంగా గుండెపోటు వచ్చి వెంటనే మరణించాడు.

.. ఇలా ఆకస్మిక గుండెపోటు మరణాలు ఎక్కువయ్యాయి.



కాల్షియం పరీక్ష.. గుండెకు రక్ష

- పెరుగుతున్న గుండెజబ్బు బాధితులు
- క్యాల్షియం స్కోర్ పరీక్షతో ముందుగా వ్యాధి నిర్ధారణ
- 40 ఏళ్లు పైబడిన, గుండెపోటు లక్షణాలు ఉండే వారికి ఉపయోగం

కర్నూలు(హాస్పిటల్): ఊరికే కూర్చుని తినే వారికి, రెగ్యులర్‌గా వాకింగ్, జిమ్, యోగా, ధ్యానం చేసే వారికీ గుండెపోటు వస్తోంది. ఎంతో నియమనిష్ఠలతో పూజలు, పునస్కారాలు చేస్తూ ఆహార నియమాలు పాటించే వ్యక్తులతో పాటు వారంలో నాలుగైదు రోజులైనా బిర్యానీ లేనిదే ముద్దమింగని వారికీ గుండెపోటులు వస్తున్నాయి. వారు వీరు అని లేకుండా ప్రతి ఒక్కరినీ ఈ సమస్య వేధిస్తుండటం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది. ఒకప్పుడు 60 ఏళ్లు పైబడిన వారికి వచ్చే గుండెపోటు ఇప్పుడు 40 ఏళ్లలోపు వారికీ వస్తోంది. ఇది రోగులకే వారి కుటుంబసభ్యులకూ మనోవేదన మిగులుస్తోంది. అయితే గుండె పోటును ముందే గుర్తించే అవకాశం ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. గుండెపోటు లక్షణాలు ఉన్నప్పుడే చేసే పరీక్షల కంటే ముందుగానే హార్ట్ ఎటాక్‌కు కారణమయ్యే రక్తనాళాల్లో ఏర్పడ్డ పూర్తి అడ్డంకులు లేదా నాళాల అంచులకు ఏర్పడ్డ ప్లేక్(ఫలకం)లను కొత్తగా కరోనరి సీటీ కాల్షియం స్కోరింగ్ పరీక్ష ద్వారా గుర్తించవచ్చు. కరోనరి కాల్షియం స్కోర్ ఎక్కువగా ఉంటే ధమని గోడలకు ప్లేక్ ఎక్కువ మొత్తంలో పేరుకున్నట్లు లెక్క. అలాగే వీరికి హార్ట్ ఎటాక్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వచ్చే ఐదు నుంచి పదేళ్లలోపు రానున్న హార్ట్ ఎటాక్‌ను కూడా ఈ కాల్షియం స్కోర్ ద్వారా తెలుసుకోవచ్చు. ఈ పరీక్షలో మొదటి నుంచి చివరి వరకు చేసే ప్రక్రియకు ఐదు నుంచి పది నిమిషాల వరకు సమయం పడుతుంది. ఈ పరీక్ష ఐదేళ్లకు ఒకసారి చేయించుకోవాలి.




ఈ పరీక్ష ఎవరికి అవసరం అంటే...!

కరోనరి కాల్షియం స్కాన్ అందరికీ అవసరం లేదు. 40 ఏళ్లు పైబడిన వారికి రిస్క్ ఫ్యాక్టర్స్ అధికంగా ఉంటే ఈ పరీక్ష ఉపయోగపడుతుంది. ఈ స్కానింగ్ రిపోర్ట్‌ను బట్టి రోగులకు వైద్యులు సలహాలు, రిస్క్ ఫ్యాక్టర్స్ గురించి స్పష్టంగా చెప్పగలుగుతారు.

పెద్దాసుపత్రి కార్డియాలజీ ఓపీకి 300 మంది

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కార్డియాలజీ విభాగంలో ప్రతి మంగళ, శుక్రవారాల్లో నిర్వహించే ఓపీకి 200 నుంచి 250 మంది రోగులు చికిత్స కోసం వస్తారు. ఇన్‌పేషంట్లుగా నెలకు 350 నుంచి 400 మంది వరకు చికిత్స అందుకుంటారు. ఈ ఆసుపత్రిలో ప్రతిరోజూ 400 మందికి ఈసీజీ, 40 నుంచి 50 వరకు 2డీ ఎకో పరీక్షలు నిర్వహిస్తున్నారు. అలాగే కర్నూలుతో పాటు నంద్యాలలోని కార్డియాలజిస్టులలో ఒక్కొక్కరి వద్దకు ప్రతిరోజూ 20 నుంచి 50 మంది వరకు చికిత్స కోసం వెళ్తుంటారు. ఉమ్మడి జిల్లా మొత్తంగా ప్రతిరోజూ 40 నుంచి 60 మందికి గుండెశస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు. సమాజంలో 50 ఏళ్ల క్రితం పుట్టుకతో కొందరికి, జన్యుకారణాలతో మరికొందరికి, వంశపారంపర్యంగా ఇంకొందరికీ గుండెజబ్బులు వచ్చేవి. వీరితో పాటు వయస్సు రీత్యా 60 ఏళ్లు దాటిన వారికి వచ్చే గుండెపోటు వంటి సంఘటనలు మాత్రమే ఉండేవి. ఇప్పుడు పై రెండు వర్గాల వారితో పాటు మధ్యవయస్సు వారు, 25 నుంచి 40 ఏళ్లలోపు యువకుల్లోనూ గుండెజబ్బులు వస్తుండటం వైద్యులనూ ఆందోళనకు గురిచేస్తోంది. మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిళ్లు చిన్నవయస్సులో గుండెపోటు రావడానికి కారణాలుగా వారు పేర్కొంటున్నారు. కడుపునిండా తినడం వ్యాయామాలు చేయకపోవడం, దాన్ని అరిగించేలా పనులూ చేయకపోవడం, కూర్చుని చేసే పనులు అధికంగా ఉండటం, దాంతో పాటు జంక్ ఫుడ్, ఫాస్ట్‌ఫుడ్ అధికంగా తీసుకోవడం, తక్కువ సమయంలో ఎక్కువ పని చేయాల్సి రావడంతో తీవ్ర మానసిక ఒత్తిడి వల్ల రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోతోంది. ఫలితంగా గుండెకు రక్తం సరఫరాలో ఇబ్బందులు ఏర్పడి గుండెపోటు వస్తోంది.

స్కానింగ్ రిపోర్ట్ ప్రమాణాలు



జీరో: ఎలాంటి ప్లేక్ లేనట్లు. అంటే హార్ట్ ఎటాక్ వచ్చే సూచనలు చాలా తక్కువ.

1–100: ప్లేక్ తక్కువ మోతాదులో ఉన్నట్లు. హార్ట్ ఎటాక్ వచ్చే అవకాశాలు పది శాతం కంటే తక్కువ.

101–400: ప్లేక్ కొంచెం ఎక్కువ మోతాదులో ఉన్నట్లు. దాంతో హార్ట్ ఎటాక్ వచ్చే అవకాశాలు కూడా కొంచెం ఎక్కువగా ఉంటాయి.

400లకు పైగా: ప్లేక్ భారీ స్థాయిలో ఉన్నట్లు. దాని వల్ల హార్ట్ ఎటాక్ వచ్చే అవకాశాలు కూడా భారీగానే ఉంటాయి. వీరు కార్డియాలజిస్టుల పర్యవేక్షణలో మందులు వాడాలి. జీవనశైలిలో మార్పులు చేసుకోవాలి.

వీరిలో రిస్క్ ఎక్కువ

గుండెజబ్బుకు సంబంధించిన లక్షణాలు కనిపించే వారి కన్నా ఎలాంటి లక్షణాలు లేని వారిలోనే రిస్క్ ఎక్కువ. ఎందుకంటే లక్షణాలు ఉంటే డాక్టర్‌ను సంప్రదించి తగిన జాగ్రత్తలు తీసుకోవచ్చు. కానీ లక్షణాలు లేకపోవడం వల్ల సమస్యను గుర్తించడం ఆలస్యమై భవిష్యత్‌లో పరిణామాలు తీవ్రంగా మారొచ్చు.

గుండెపోటుకు కారణాలు

రక్తంలో అధిక కొవ్వు శాతం, మధుమేహం, అధిక రక్తపోటు, ధూమపానం, అధిక బరువు, వంశపారంపర్యం, శారీరక శ్రమ లేకపోవడం, దీర్ఘకాలిక మానసిక ఒత్తిడి

వ్యాధి నిర్ధారణ

2డీ ఎకో, టీఎంటీ పరీక్షలు అప్పటి గుండె పరిస్థితిని వివరంగా క్షుణ్నంగా చెప్పగలవు. అయితే భవిష్యత్‌లో వచ్చే ప్రమాదాలను మాత్రం గుర్తించలేవు. యాంజియోగ్రామ్, కంప్యూటెడ్ టోమోగ్రఫీ(సీటీ) యాంజియోగ్రామ్ పరీక్షల ద్వారా గుండె రక్తనాళాల్లో బ్లాకేజీలు ఉంటే గుర్తించి తొలగించుకోవాలి. అయితే ఇవన్నీ లక్షణాలున్న గుండెజబ్బు గల రోగులకు మాత్రమే, ప్రతి ఒక్కరికీ కాదు.

హార్ట్ ఎటాక్‌ను ముందే నివారించుకోవచ్చు



కరోనరి కాల్షియం స్కోర్ అనే పరీక్ష గుండె రక్తనాళాల్లోని బ్లాకేజీలను గురించి పూర్తిగా గుర్తిస్తుంది. అది గుండెలోని కొలెస్ట్రాల్ లోడ్ ఏ లెవెల్‌లో ఉందో చెప్పేస్తుంది. అయితే కొలెస్ట్రాల్ లోడ్ ఎంత ఎక్కువ ఉంటే హార్ట్ ఎటాక్ వచ్చే అవకాశాలు అంత ఎక్కువగా ఉంటాయి. ఆ నివేదిక ప్రకారం భవిష్యత్‌లో హార్ట్ ఎటాక్ వచ్చే అవకాశాలు ఎంత ఉన్నాయో కార్డియాలజిస్టు చెప్తారు. కరోనరి ఆర్టరి కాల్షియం స్కోర్ అనేది గుండె కాల్సిఫికేషన్(బోన్ డిపోజిషన్)ను అంచనా వేస్తుంది. అలాగే హృదయనాళానికి సంబంధించిన ప్రతి అంశాన్ని తెలుపుతుంది. ఈ రిపోర్ట్‌లో స్కోర్ ఎక్కువగా ఉంటే వైద్యుల సూచనలతో మందులు వాడాలి.

– డాక్టర్ తేజానందన్‌రెడ్డి, కార్డియాలజిస్టు, కర్నూలు

అర్ధరాత్రి ఎస్పీ ఆకస్మిక తనిఖీ

కర్నూలు: పోలీసు సిబ్బంది గస్తీ విధులు ఎలా నిర్వహిస్తున్నారనే దానిపై ఎస్పీ బిందు మాధవ్ క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత నైట్ పెట్రోలింగ్ వ్యవస్థను ఎస్పీ పునరుద్ధరించారు. క్షేత్రస్థాయిలో ఎలా అమలు జరుగుతుందోనని స్వయంగా తనిఖీ చేశారు. ఆదోని వన్‌టౌన్, టూటౌన్, ఎమ్మిగనూరు అర్బన్ పోలీస్ స్టేషన్లను బుధవారం అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీ చేసి గస్తీ పోలీసులతో నేరుగా మాట్లాడారు. రాత్రివేళ విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని, నిత్యం సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే విచారించాలని సూచించారు. నేర చరిత్ర ఆధారంగా క్రైం హాట్‌స్పాట్‌లను గుర్తించి ఆ ప్రాంతాల్లో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. నేర సంఘటనలు, నేరస్తులను గుర్తించడానికి ర్యాండమైజ్డ్ పెట్రోలింగ్ రూట్లు, గస్తీ మార్గాలను మార్చాలని ఆదేశించారు. క్రైం పీక్ హవర్స్, హైరిస్క్ ఉన్న ప్రాంతాల్లో డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐ స్థాయి వారు పర్యవేక్షణ అధికారులుగా ఉండి రాత్రి గస్తీ తనిఖీలు చేపట్టాలన్నారు. ఎస్‌బీ సీఐ ప్రసాద్, ఆదోని పట్టణ సీఐ శ్రీరాం తదితరులు ఎస్పీ వెంట ఉన్నారు.



గస్తీ విధుల్లో ఉన్న సిబ్బంది పనితీరును పరిశీలించి బీట్ పుస్తకాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఇక కలేనా?

- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- భూసేకరణతోపాటు నిధులు మంజూరు చేసిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

డోన్: సంపద సృష్టిస్తామంటూ అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు.. అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. అభివృద్ధికి పనులను అటకెక్కిస్తూ ఆర్థికాభివృద్ధికి గండికొడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతుల కోసం చేపట్టిన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ మార్కెట్‌ను పట్టించుకోవడం లేదు. దేశంలోనే హర్యానా, కర్ణాటక రాష్ట్రాల తర్వాత మన రాష్ట్రంలో ఇలాంటి మార్కెట్ నిర్మాణం ఉండాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఇందుకోసం ప్యాపిలిలో 45–1ఎ, 1బి, 1బి2, 46 సర్వే నంబర్లలో 24.56 ఎకరాల భూమిని సేకరించారు. అంతేకాకుండా రూ.48.59 కోట్ల నిధులు మంజూరు చేస్తూ 2022 జూన్ 06వ తేదీన 704 జీఓను జారీ చేయించారు. ఈ ఏడాది మార్చిన 15న ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ మార్కెట్ నిర్మాణానికి భూమి పూజ కూడా చేశారు. అయితే టెండర్ ఖరారు చేసేలోపే కొత్త ప్రభుత్వం మారడంతో ఈ ప్రక్రియ అటకెక్కింది. రైతులకు ఎంతో మేలు చేసే ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ మార్కెట్ నిర్మాణంలో ఇప్పట్లో కదలిక వచ్చే సూచనలు కనిపించడం లేదు.

ఇవీ ప్రయోజనాలు..

ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ మార్కెట్‌లో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో 60 రిటైల్ షాపులు, 15 హోల్‌సెల్ షాపులు, రెండు కోల్డ్ స్టోరేజీలు, నాలుగు ప్రాసెసింగ్ బ్లాకులు, రైతులు, వ్యాపారులకు వసతి గృహాలు, బ్యాంకు, పోస్టాఫీసు, పెట్రోల్ బంకులను నిర్మించనున్నారు. మొత్తం రూ.49.50 కోట్లలో రూ.12.50 కోట్లు హార్టికల్చర్ శాఖ భరించేందుకు ముందుకు వచ్చింది. మిగిలిన రూ.37 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ప్రైవేటు భాగస్వామం కూడా కదు రింది. ఈ మార్కెట్ ఏర్పడితే డోన్, పత్తికొండ ని యోజకవర్గాల్లో పండ్లు, కూరగాయల సాగు పెరిగే అవకాశం ఉంది. వెంటనే మార్కెట్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



మార్కెట్‌లో సెమీ రిటైల్ షాపుల నమూనా

వెంటనే నిర్మించాలి



భేషజాలకు పోకుండా టీడీపీ నేతలు వెంటనే మార్కెట్‌ను నిర్మించాలి. రైతాంగం ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేయాలి. వీలైనంత త్వరగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరుతున్నాం.

– లక్ష్మీరంగయ్య, రైతు, బోయవాండ్లపల్లె, ప్యాపిలి మండలం

ఒక్కరోజు ముందే పింఛన్ల హడావుడి

- గొప్పలకు పోయి ప్రభుత్వ నిర్ణయం

కర్నూలు(అగ్రికల్చర్): సెప్టెంబర్ నెల సామాజిక భద్రత పింఛన్లను ఈనెల 31నే పంపిణీ చేయడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. 1వ తేదీ ఆదివారం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఉమ్మడి కర్నూలు జిల్లాకు రూ.195.83 కోట్లు విడుదల చేశారు. మొదటి రోజునే దాదాపు 99 శాతం పింఛన్లు పంపిణీ చేయాలని, మిగిలిపోతే సెప్టెంబర్ 2వ తేదీ పంపిణీ చేస్తారని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ సలీమ్‌బాషా తెలిపారు. గత వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం 1వ తేదీ ఆదివారమైనా, పండుగ ఉన్న, వర్షాలు పడుతున్నా అదేరోజు పింఛన్లు పంపిణీ చేసింది. అయితే ఒక్కరోజు ముందే పంపిణీ చేశామని చెప్పుకునేందుకు ప్రస్తుత ప్రభుత్వం ఆపసోపాలు పడుతోంది. ఇదిలాఉంటే పత్తికొండ నియోజకవర్గం పుచ్చకాయలమడ గ్రామంలో జరిగే పింఛన్ల పంపిణీలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాల్గొంటున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

- 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వృద్ధాప్య పింఛన్లు పంపిణీ చేస్తామని ఎన్నికల సమయంలో ప్రతి సభలోనూ కూటమి నేతలు ప్రకటించారు. ప్రభుత్వం ఏర్పాటై రెండున్నర నెలలు దాటినప్పటికీ కొత్త పింఛన్ల ఊసే లేకపోవడం గమనార్హం.

నేడు గ్రేడు-2 వీఆర్వోల బదిలీల కౌన్సెలింగ్

కర్నూలు(సెంట్రల్): గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రేడ్-2 వీఆర్వోలకు శుక్రవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీఆర్వో కె.మధుసూదన్‌రావు తెలిపారు. గురువారం డీఆర్వో కార్యాలయంలో ఆయన నంద్యాల డీఆర్వో పద్మజతో కలసి బదిలీల ప్రక్రియపై సమీక్షించారు. నంద్యాల జిల్లా నుంచి ఎక్కువగా అన్ని కేడర్లలో కర్నూలుకు వచ్చేందుకు అధికారులు మొగ్గు చూపుతున్నారు. అదే సమయంలో కర్నూలు నుంచి నంద్యాల వెళ్లేందుకు తక్కువ సంఖ్యలో ఉద్యోగులు ఆప్షన్ ఇచ్చారు. ఈక్రమంలో ఏమి చేయాలనే విషయమై రెండు జిల్లాల డీఆర్వోలు చర్చించారు. అయితే కర్నూలు నుంచి ఎంతమంది అధికారులైతే నంద్యాలకు వెళ్లడానికి ఇష్టపడతారో.. అదే సంఖ్యలో అక్కడి నుంచి ఇక్కడకు బదిలీ చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో కర్నూలు, నంద్యాల కలెక్టరేట్ ఏఓలు రాజశేఖరి, రవికుమార్ పాల్గొన్నారు.

స్వర్ణ రథంపై మల్లన్న తేజం



ఆలయ మాడవీధుల్లో స్వర్ణరథోత్సవ దృశ్యం

శ్రీశైలంటెంపుల్: ఇలకైలాసమైన శ్రీశైల మహాక్షేత్రంలో మొట్టమొదటిసారిగా స్వర్ణరథంపై ఆదిదంపతులైన పార్వతీ పరమేశ్వరులు విహరించారు. స్వామి అమ్మవార్ల వైభవాన్ని తిలకించి భక్తులు తన్మయత్వం పొందారు. హరోం..హర..శంకరా, ఓం నమఃశివాయ అంటూ శివనామస్మరణ చేస్తూ నీరాజనాలు సమర్పించారు. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని గురువారం వేకువజామున స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు చేశారు. లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం స్వర్ణ రథంపై ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేసి విశేషపూజలు నిర్వహించారు. ఆలయ మహాద్వారం ముందుభాగం నుంచి ఉదయం 7.30 గంటలకు స్వర్ణరథోత్సవం ప్రారంభమై నాలుగు మాడవీధులగుండా అంగరంగ వైభవంగా సాగింది. ఉత్సవంలో కోలాటం, చెక్కభజన మొదలైన జానపద కళారూపాలు ఆకట్టుకున్నాయి. శ్రీశైల జగద్గురు పీఠాధిపతి చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామి, స్వర్ణరథం దాత కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు దంపతులు, అర్చకులు, వేదపండితులు, పలు విభాగాల అధికారులు, పర్యవేక్షకులు, భక్తులు పాల్గొన్నారు.



స్వర్ణరథంపై ఆదిదంపతులు

బదిలీల కోలాహలం

కర్నూలు అర్బన్: ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల బదిలీలకు పచ్చ జెండా ఊపడంతో జిల్లాలోని గ్రామ/వార్డు సచివాలయాల్లోని గ్రేడ్-5, గ్రేడ్ -6 పంచాయతీ కార్యదర్శులు, వార్డు వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లతో గురువారం జిల్లా పరిషత్ ప్రాంగణం కిటకిటలాడింది. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు బదిలీలు కోరుతూ కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు 43 మంది, గ్రేడ్ -6 పంచాయతీ కార్యదర్శులు 67 మంది బదిలీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వీరి దరఖాస్తులను కర్నూలు, నంద్యాల డీపీఓలు టీ నాగరాజునాయుడు, మంజులావాణి, డీఎల్‌పీఓలు తిమ్మక్క, నూర్జహాన్, ఏఓ ప్రతిమ పరిశీలించారు. అలాగే వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు మొత్తం 299 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో బదిలీల జీఓకు అనుగుణంగా 40, పరస్పర బదిలీలకు 44, అదర్స్ కింద 215 దరఖాస్తులు వచ్చాయి. జీఓకు అనుగుణంగా ఉన్న వాటిని ఆమోదిస్తు, మిగిలిన వాటిని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుపోనున్నారు.



జెడ్పీలో బదిలీల కౌన్సెలింగ్‌కు హాజరైన సచివాలయ ఉద్యోగులు

క్లుప్తంగా

ఏరువాక కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోండి

- కో–ఆర్డినేటరు డాక్టర్ సుజాతమ్మ

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటైన ఏరువాక కేంద్రం (డాట్ సెంటరు) సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కో–ఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుజాతమ్మ తెలిపారు. నంద్యాలలో ఉన్న ఈ కేంద్రాన్ని ఇటీవల కర్నూలు మార్కెట్ యార్డుకు మార్చారన్నారు. పంటల్లోని చీడపీడలు, ఇతర సమస్యలను ఏరువాక కేంద్రం ద్వారా పరిష్కరించుకునేందుకు సలహాలు, సూచనలు ఇస్తామని తెలిపారు. చీడపీడలు, ఇతర సమస్యలు ఉన్న భూముల్లోని మొక్కలను తెచ్చినా పరిశీలించి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. అవసరమైతే క్షేత్రస్థాయికి కూడా వస్తామని తెలిపారు. ఇతర వివరాలకు 99488 13842ను సంప్రదించాలన్నారు.

తేలు కాటుతో వృద్ధుడి మృతి

మద్దికెర: మద్దికెర మజారా గ్రామమైన బొజ్జనాయుని పేట గ్రామంలో గురువారం తెల్లవారుజామున తేలు కుట్టి పట్నం చిన్న వెంకటేశులు (65) అనే వృద్ధుడు మృతి చెందాడు. మట్టి మిద్దె ఇంట్లో నిద్రిస్తుండగా తేలు పైనుంచి మీద పడి కుట్టింది. వెంటనే కుటుంబీకులు తేలును చంపేసి, అస్వస్థతకు గురైన వృద్ధుడిని వైద్యపరీక్షలు కోసం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

బైకులు ఢీకొని ఒకరి మృతి


మృతి చెందిన రామాంజనేయులు

వెలుగోడు: వెలుగోడు – అబ్దుల్లాపురం గ్రామాల మధ్యలో గురువారం రాత్రి రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వెలుగోడు పట్టణానికి చెందిన బోయ రామాంజనేయులు (40) పనులు ముగించుకొని వేల్పనూరు నుంచి వెలుగోడుకు వస్తుండగా, బలిజ మహేష్ వెలుగోడు నుంచి వేల్పనూరు గ్రామం వైపు వెళ్తుండగా ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బోయ రామాంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. బలిజ మహేష్‌కు తీవ్ర గాయాలు కాగా వెలుగోడు ప్రథమ చికిత్స అనంతరం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విష్ణు నారాయణ తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


చకచకా.. ఒక రూపు వచ్చింది.. చివరలో మెరుపులు ఎంత చక్కగుందో చూడు..

నీ ఇల్లు బంగారం గాను!

గిజిగాడి ఇల్లు చూస్తే ఆశ్చర్యం.. అద్భుతం. చిటారు కొమ్మన గడ్డి పోచా ముడి వేసి.. ఏ ఇంజినీరో చెప్పినట్లుగా.. చేనేత నేసినట్లుగా.. గూడు కట్టుకోవడం ఈ పక్షికే సొంతం. కుండపోత వర్షం కురిసినా.. పెను గాలులు వీచినా చెక్కు చెదరకుండా.. శత్రుదుర్భేద్యంగా.. ఎంతో అందంగా మగ పక్షి కట్టుకున్న గూడును చూస్తే ఆడపక్షి అందులో వాలిపోవాల్సిందే. గుడ్లు పొదగడం.. పిల్లలు లేయడం.. వాటికి కొన్నాళ్లపాటు ఆహారం అందించడం.. ఇలా అన్నింటికీ ఆ గూడే సాక్ష్యం. గిజిగాడి కుటుంబానికి ఆ ఇల్లే బంగారం. కర్నూలు మండలం నిడ్జూరు సమీపంలో ఈత చెట్లకు పదుల సంఖ్యలో గిజిగాడు గూళ్లు ఆకట్టుకుంటున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు


ఈత చెట్టు నిండా గిజిగాడు గూళ్లు

శారీరక వికలాంగుల హాస్టల్‌లో ప్రవేశం పొందండి

కర్నూలు(అర్బన్): సి.క్యాంప్ ప్రభుత్వ శారీరక వికలాంగుల బాలుర వసతిగృహంలో అర్హులైన విద్యార్థులు ప్రవేశం పొందాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్ ఫాతిమా కోరారు. వసతిగృహంలో 2024–25 విద్యా సంవత్సరానికి 100 మంది విద్యార్థులకు వసతి కల్పిస్తామన్నారు. 3వ తరగతి నుంచి ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ తదితర కోర్సులు చదువుతున్న శారీరక వికలాంగులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 08518 – 277864ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ముందుకు సాగని పంటల నమోదు

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటల నమోదుకు సాంకేతిక సమస్యలు అడ్డంకిగా మారాయి. ప్రధానంగా రీ సర్వే చేసిన గ్రామాల్లో పంటల నమోదు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. రీసర్వే గ్రామాల్లో ఖాతా నెంబర్లు లేవు.. ఎల్‌పీ నెంబర్లు మాత్రమే జాయింట్‌గా ఉంటాయి. ఒక ఎల్‌పీలో ఇద్దరు నుంచి 10 మంది వరకు రైతులు ఉంటారు. ఎల్‌పీ నెంబర్లను రెవెన్యూ అధికారులు రైతుల వారీగా విడగొట్టాలి. ఈ విషయంలో వీఆర్‌వోలు కీలకం. అయితే ఈ ప్రక్రియను చేపట్టేందుకు వీఆర్‌ఓలు విముఖత చూపుతున్నట్లు తెలుస్తోంది. 254 గ్రామాల్లో రీసర్వే చేపట్టగా 15,732 ఎల్‌పీలు ఉన్నాయి. ఈ విషయంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో పురోగతి లోపించింది. ఆదోని, హాలహర్వి, చిప్పగిరి, హొలగొంద, కోసిగి, కౌతాళం, క్రిష్ణగిరి, మంత్రాలయం, నందవరం, పత్తికొండ మండలాల్లో ఒక్క ఎల్‌పీని కూడా రైతుల వారీగా విడగొట్టకపోవడం గమనార్హం. ఖరీఫ్ సాధారణ సాగు 10,35,895.1 ఎకరాలు ఉండగా ఇప్పటి వరకు 8,32,131.5 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇందులో 5,58,171.4 ఎకరాల్లో సాగు చేసిన పంటలను మాత్రమే నమోదు చేశారు. నమోదు 67.1 శాతం మాత్రమే ఉంది. ముందుగా ప్రకటించిన షెడ్యూలు ప్రకారం సెప్టెంబర్ 15లోగా ఈ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది.

వేంపెంటలో ప్రబలిన అతిసారం

- మంచంపట్టిన 12 మంది


అతిసార బాధితునితో మాట్లాడుతున్న వైద్యురాలు గులాబ్‌షా, సిబ్బంది

పాములపాడు: నంద్యాల జిల్లా పాములపాడు మండలంలోని వేంపెంటలో అతిసార వ్యాధి ప్రబలి గురువారం 12 మంది మంచంపట్టారు. గ్రామంలోని బీసీ కాలనీలో అర్ధరాత్రి నుంచి ప్రజలు వాంతులు, విరేచనాలతో తీవ్ర ఇబ్బంది పడ్డారు. విషయం తెలుసుకున్న వైద్య సిబ్బంది మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. డాక్టర్లు నాగలక్ష్మి, గులాబ్‌షా, వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. అతిసార బాధితుల్లో మిన్నల్ల కర్నూలులో, చిన్న నాగన్న, శేషన్నలు నంద్యాలలో, రాములమ్మ, రమేష్ ఆత్మకూరులో చికిత్సలు పొందుతున్నారు. మిగిలిన అమీర్‌బాష, ముర్తుజాబి, బేగమ్, ఇర్ఫాన్, రామచంద్రుడు, లలిత, శివలు గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలోనే చికిత్స పొందుతున్నారు. కాగా ప్రస్తుతం అందరి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ కాంతారావునాయక్.. ఎంపీడీఓ గోపీకృష్ణ, సర్పంచ్ మాణిక్యమ్మతో కలిసి గ్రామంలో పర్యటించారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ సైతం వైద్య శిబిరాన్ని పరిశీలించారు.

సెల్‌ఫోన్ వినియోగంలో బాలికలు అప్రమత్తం

- డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద

కర్నూలు: బాలికలు సెల్‌ఫోన్ వినియోగించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, అనవసరమైన లింకులు, యాప్స్‌పై క్లిక్ చేసి సైబర్ నేరాల ఉచ్చులో ఇరుక్కోవద్దని డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద సూచించారు. బాలికలపై లైంగిక వేధింపులు అరికడదాం... మాదక ద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాల పట్ల పాటించాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై కర్నూలు పాతబస్తీలోని హజీరా డిగ్రీ కళాశాలలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద, చీఫ్ డిఫెన్స్ లీగల్ ఎయిడ్ అడ్వైజర్ మనోహర్, మహిళా పీఎస్ సీఐ అబ్దుల్ గౌస్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ సమీవుద్దీన్, కళాశాల స్పెషల్ ఆఫీసర్ బీబీ నవాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు, బాలికలపై వేధింపులు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వక్తలు సూచించారు. పోక్సో కేసులలో 90 శాతం తెలిసిన వారి ద్వారానే జరుగుతున్నాయన్నారు. తల్లిదండ్రులు విధి నిర్వహణలో బిజీగా ఉంటూ పిల్లలను పట్టించుకోకుండా విస్మరిస్తున్నారన్నారు. పిల్లలు ఏమి చేస్తున్నారు, ఎలా చదువుతున్నారు, ఎవరెవరితో తిరుగుతున్నారు అని గమనించి వారితో తరచూ మాట్లాడుతూ కనిపెడుతూ ఉండాలని సూచించారు. గృహహింస చట్టం గురించి మహిళలు భయపడకుండా నిర్భయంగా ఫిర్యాదు చేయాలన్నారు. సమాజం మార్పు కోసం మహిళలు హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. బాలికల లైంగిక వేధింపుల గురించి, పోక్సో చట్టం గురించి, కొత్త చట్టాల గురించి, వాటి శిక్షల గురించి వివరించారు.

టీడీపీ నేతల దౌర్జన్యం


పోలీసుల సమక్షంలో జేసీబీతో కూల్చివేస్తున్న రెవెన్యూ అధికారులు


వైఎస్సార్‌సీపీ నాయకులు సాగు చేసుకున్న ప్రభుత్వ భూమి

- వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై తెలుగు తమ్ముళ్ల దాడులు
- అధికారుల మాటున ఆగడాలు
- ఓర్వకల్లు మాజీ సర్పంచ్‌పై కక్షసాధింపు చర్యలు
- పొలం ప్రహరీ కూల్చేసిన వైనం

ఓర్వకల్లు: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై తెలుగు తమ్ముళ్ల దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. అధికారులను అడ్డం పెట్టుకుని కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. గురువారం మండల కేంద్రమైన ఓర్వకల్లు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకురాలు నాగేశ్వరమ్మ (మాజీ సర్పంచు)కు సంబంధించిన 40 సెంట్ల భూమి చుట్టూ నిర్మించిన ప్రహరీని కూల్చివేసి భయాందోళన కల్పించారు. గ్రామానికి చెందిన అనూష వైఎస్సార్‌సీపీ మద్దతురాలిగా సర్పంచుగా ఎన్నికైంది. అయితే ఆమెకు ప్రభుత్వ ఉద్యోగం రావడంతో ఆ పదవికి రాజీనామా చేశారు. ఆతర్వాత ఆమె సొంత అత్త నాగేశ్వరమ్మ సర్పంచుగా బాధ్యతలు చేపట్టింది. ఈ విషయంలో నాగేశ్వరమ్మకు, తన సమీప బంధువులతో (టీడీపీ నాయకులు) మధ్య విబేధాలు తలెత్తాయి. ఈ విబేధాలు మరింత తారాస్థాయి చేరుకున్నాయి. దీంతో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం, రాజకీయ ఒత్తిళ్లతో నాగేశ్వరమ్మ మూడు నెలల క్రితం సర్పంచు పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. అయినా తెలుగు తమ్ముళ్ల ఆగడాలు ఆగలేదు. కక్షసాధింపు ధోరణితో నాగేశ్వరమ్మ గత 30 ఏళ్ల నుంచి గ్రామ సమీపంలో గల సర్వే నెంబర్ 202లో 40 సెంట్ల ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్నారు. అది కూడా సర్వే నంబర్ 201లో 5.26 ఎకరాల తమ పట్టా భూమికి పక్కన ఉండడంతో ఆ భూమిని సాగు చేసుకుంటున్నారు. ఆ స్థలానికి ప్రహరీ నిర్మించుకున్నారు. ప్రస్తుతం ఈ భూమిలో పశుగ్రాసం సాగుచేసుకున్నారు. రాజకీయ నాయకుల ఫిర్యాదు మేరకు ఆ స్థలం చుట్టూ ప్రహరీని సాక్షాత్తు తహసీల్దార్ వెంకటరమణ, ఎస్‌ఐ సునీల్‌కుమార్ సమక్షంలో జేసీబీతో కూల్చివేసినట్లు బాధితురాలు వాపోతోంది.

కక్ష సాధింపుతోనే కూల్చివేత



మా ఎదుగుదలను చూసి ఓర్వలేకనే ఈ దుశ్చర్యలకు పాల్పడుతున్నారు. మేము గత 30 క్రితం ప్రభుత్వ భూమిని అనుభవిస్తున్న మాట వాస్తవమే. ఈ భూమిని ప్రభుత్వ అవసరాలకు అప్పగిస్తామని చెప్పినా వినిపించుకోకుండా కక్ష సాధింపు ధోరణితో కూల్చివేతకు పాల్పడడం ఎంత వరకు సమంజసం.

– నాగేశ్వరమ్మ, మాజీ సర్పంచు, ఓర్వకల్లు

APACFIN

APAC ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్

ఆఫీస్ నం.501, 5వ అంతస్తు, సౌత్ అనెక్స్ టవర్ 2, వన్ వరల్డ్ సెంటర్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ పరేల్, ముంబయి – 400013
ఇ–మెయిల్:contactus@apacfin.com | టెలిఫోన్: 022-47781138 | వెబ్‌సైట్: www.apacfin.com
CIN-U65999MH2017PTC294664

బహిరంగ ప్రకటన

సెక్యూర్డ్ ఆస్తుల అమ్మకం కోసం టెండర్ కమ్ వేలం

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ("చట్టం") మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 ("రూల్స్")లోని రూల్ 9తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ APAC ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ("లెండర్") అధీకృత అధికారియగు దిగువ సంతకందారు (1) శ్రీ దీక్షిత ఎడ్యుకేషనల్ సొసైటీ ("రుణగ్రహీత"), (2) శ్రీమతి దరూరి భారతి ("సహ–రుణగ్రహీత"), (3) శ్రీ వద్యావుల చితంబరప్ప ("సహ–రుణగ్రహీత")లకు సదరు చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద 21-09-2023న చట్టపరమైన డిమాండ్ నోటీసు జారీ చేశారు మరియు ఆ తరువాత 22-12-2023న తనఖాదారుకు చెందిన దిగువ తెలిపిన ఆస్తులు ("సెక్యూర్డ్ ఆస్తులు") నిర్మాణాత్మకంగా స్వాధీనం చేసుకున్నారు. భౌతిక స్వాధీనం కొరకు SARFAESI లోని సెక్షన్ 14 క్రింద చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కమ్ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి, కర్నూలు వారు 22-07-2024 తేదీ గల ఉత్తర్వు జారీ చేశారు. అందువలన మా ఇ–ఆక్షన్ సర్వీస్ ప్రొవైడర్ మెసర్స్ C1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా వెబ్ పోర్టల్ https://www.bankeauctions.com ద్వారా "ఎక్కడ ఎలా ఉన్నవి", "అక్కడ ఆ విధంగానే ప్రాతిపదికన", "అక్కడ ఏమున్నవో అవే ప్రాతిపదికన" మరియు "ఎటువంటి సహాయంలేని ప్రాతిపదికన లెండర్ యొక్క నిర్మాణాత్మక స్వాధీనతలో ఉన్న దిగువ తెలిపిన సెక్యూర్డ్ ఆస్తుల అమ్మకం కోసం 03 అక్టోబర్, 2024న లేదా అలోగా సా.5.00 గంటల వరకు ఆసక్తిగల వ్యక్తులు/ పాల్గొనుదారుల నుండి ఆన్‌లైన్ ద్వారా ఆఫర్లు దాఖలు చేయవలసిందిగా ఇందుమూలంగా కోరడమైనది. వివరాలు దిగువ విధంగా ఉన్నాయి.

షెడ్యూలు

స్థిరాస్తుల వివరణ	శ్రీమతి దరూరి భారతి కి చెందిన ఆస్తి కర్నూలు జిల్లా, కొలిమిగుండ్ల మండలం, కొలిమిగుండ్ల గ్రామం వద్ద గల సర్వే నం.423/3 గల 80 సెంట్ల విస్తీర్ణపు భూమి యావత్తు. సరిహద్దులు: తూర్పు: సర్కార్ బంజరు మరియు ఇమ్మూవ్యయేల్ భూమి, దక్షిణం: బి. అనసూయమ్మకు చెందిన భూమి, పశ్చిమం: రస్తా, ఉత్తరం: డి. చంద్రశేఖర్ నాయుడుకు విక్రయించిన చిన్న రవీందర్ గుప్తా భూమి. భూమికి జతచేసిన లేదా భూమికి జతచేసిన దేనికైనా శాశ్వతంగా అమర్చిన లేదా దానిపై ఉంచిన / గల దానిపై నిర్మించే / స్థాపించే మరియు / లేదా అన్ని ఎక్విప్‌మెంట్లు, ఫిట్టింగ్స్, ఫర్నిచర్ మరియు దానిపై నిర్మించిన / స్థాపించిన అన్ని భవనములు మరియు కట్టడాలతో కలిపి. శ్రీ దీక్షిత ఎడ్యుకేషనల్ సొసైటీకి చెందిన ఆస్తి కర్నూలు, కొలిమిగుండ్ల మండలం, కొలిమిగుండ్ల గ్రామం మరియు గ్రామపంచాయతీ వద్ద గల సర్వే నం.416/2 గల 1.37 ఎకరాల విస్తీర్ణపు భూమి యావత్తు, సరిహద్దులు: తూర్పు: పోలిరెడ్డి కృష్ణారెడ్డి భూమి, దక్షిణం: లిటిల్ ఫ్లవర్ స్కూల్ భూమి, పశ్చిమం: రస్తా మరియు దరూరి చంద్రశేఖర్ నాయుడు భూమి, ఉత్తరం: బట్టా రవి భూమి. భూమికి జతచేసిన లేదా భూమికి జతచేసిన దేనికైనా శాశ్వతంగా అమర్చిన లేదా దానిపై ఉంచిన / గల దానిపై నిర్మించే / స్థాపించే మరియు / లేదా అన్ని ఎక్విప్‌మెంట్లు, ఫిట్టింగ్స్, ఫర్నిచర్ మరియు దానిపై నిర్మించిన / స్థాపించిన అన్ని భవనములు మరియు కట్టడాలతో కలిపి.
రిజర్వు ధర (రూ.లో)	రూ.1,37,24,383/- (ఒక కోటి ముప్పై ఏడు లక్షల ఇరవై నాలుగు వేల మూడు వందల ఎనభై మూడు రూపాయలు మాత్రమే)
బయానా ("EMD") (రూ.లో)	రూ.6,86,220/- (ఆరు లక్షల ఎనభై ఆరు వేల రెండు వందల ఇరవై రూపాయలు మాత్రమే)
బయానా చెల్లింపు	రిజర్వు ధరలో 5% బయానా (EMD) మొత్తాన్ని దిగువ తెలిపిన ఖాతాలో NEFT / RTGS ద్వారా చెల్లించవలెను. అకౌంట్ పేరు: APAC ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యాంక్ పేరు: కోటక్ బ్యాంక్ అకౌంట్ నంబరు: 1612040002 అకౌంట్ బ్రాంచ్: లోయర్ పరేల్, ముంబయి IFSC కోడ్: KKBK0000648
బిడ్ / EMD మరియు ఇతర KYC డాక్యుమెంట్లు దాఖలుకు చిరునామా	శ్రీ నవీన్ కుమార్ (అధీకృత అధికారి), APAC ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, ఆఫీస్ నం.501, 5వ అంతస్తు, సౌత్ అనెక్స్ టవర్ 2, వన్ వరల్డ్ సెంటర్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ పరేల్, ముంబయి – 400013
బిడ్ పెంపుదల విలువ (రూ.లో)	5 (ఐదు) లక్షలు
తనిఖీ తేదీ మరియు సమయం	19 సెప్టెంబర్, 2024 మరియు 20 సెప్టెంబర్, 2024, మ.1.00 గం. నుండి సా.5.00 గం. మధ్య
ఇ–వేలం తేదీ మరియు సమయం	03 అక్టోబర్, 2024, మ.3.00 గం. నుండి సా.5.00 గం. వరకు
బయానా దాఖలుకు ఆఖరి తేదీ	01 అక్టోబర్, 2024, సా.5.00 గం. వరకు

నియమ నిబంధనలు

(1) లెండర్ యొక్క అధీకృత అధికారి సదరు సెక్యూర్డ్ ఆస్తులను విక్రయించాలని నిర్ణయించినందున, పై షెడ్యూల్స్‌లో వివరించిన విధంగా సెక్యూర్డ్ ఆస్తులు 03 అక్టోబర్, 2024న (పైన పేర్కొన్న పట్టికలో తెలిపిన సమయం మధ్య) ఆన్‌లైన్ వేలం ద్వారా విక్రయించబడునని ఈ అమ్మకం నోటీసు నేడు ప్రచురించబడింది.

(2) ఆసక్తి గల పార్టీలు APAC ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారికి ఒక రోజు ముందు నోటీసు ఇచ్చి 2398, 13వ మెయిన్, 14వ క్రాస్, ఇ–బ్లాక్, సహకార్ నగర్, బెంగళూరు-560092 వద్ద 19 సెప్టెంబర్, 2024 మరియు 20 సెప్టెంబర్, 2024, మ.1.00 గం. నుండి సా.5.00 గం. మధ్య డాక్యుమెంట్లను పరిశీలించుకోవచ్చును.

(3) ఆన్‌లైన్ వేలం 03 అక్టోబర్, 2024, మ.3.00 గం. నుండి సా.5.00 గం. మధ్య M/s.C1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వెబ్‌సైట్ అనగా https://www.bankeauctions.comలో జరుగుతుంది. ఆన్‌లైన్ వేలం https://www.bankeauctions.com ద్వారా నిర్వహించబడును మరియు లెండర్ వెబ్‌సైట్ అనగా https://apacfin.com/ మరియు వేలం ఏజెన్సీ అనగా M/s.C1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వెబ్‌సైట్‌లో లభించే టెండరు డాక్యుమెంట్‌లో ఉన్న నియమ నిబంధనలకు లోబడి జరుగుతుంది. ఏవేని పోర్టల్ సంబంధిత సహాయం కోసం సంప్రదించండి: భవిక్ ఆర్ పాండ్య, సంప్ర నం.: 8866682937.

(4) సదరు చట్టంలోని సెక్షన్ 13(13)ను అనుసరించి ఏ రూపంలోను పైన తెలిపిన విధంగా సెక్యూర్డ్ ఆస్తులతో వ్యవహరించరాదని ముఖ్యంగా తనఖాదారు/ గ్యారంటార్లు/ రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలు హెచ్చరించబడుతున్నారు మరియు నిరోధించబడినారు మరియు సెక్యూర్డ్ ఆస్తులతో జరిపే ఏ లావాదేవీలైనా మొత్తాలు మరియు దానిపై తదుపరి వడ్డీల కోసం APAC ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ హక్కుకు లోబడి ఉంటాయి.

(5) పూర్తి బకాయిల మొత్తం 20 సెప్టెంబర్, 2023 నాటికి రూ.1,56,93,394/- (ఒక కోటి యాభై ఆరు లక్షల తొంభై మూడు వేల మూడు వందల తొంభై నాలుగు రూపాయలు మాత్రమే)లను చెల్లించని TDS, సెక్యూరిటీ ట్రస్టీ ఫీజు, లీగల్ కౌన్సిల్ ఫీజు (వాస్తవ గణాంకాలలో), అనుషంగిక ఖర్చులు, వ్యయం, ఛార్జీలు మొ.వాటితో చెల్లించే వరకు/ రాబట్టుకునే వరకు దానిపై వడ్డీ, పీనల్ చార్జీలు మరియు ఇతర ఛార్జీలతో పాటు చెల్లించేందుకు తనఖాదారు/ గ్యారంటార్లు/ రుణగ్రహీతకు తుది అవకాశం ఇవ్వబడింది. సదరు బకాయిలను తనఖాదారు/ గ్యారంటార్లు/ రుణగ్రహీత 19 సెప్టెంబర్, 2024న సా.5.00 గం.లకు లేదా అలోగా చెల్లించాలి, లేనట్లయితే ఈ సెక్యూర్డ్ ఆస్తి పైన తెలిపిన విధంగా షెడ్యూల్ ప్రకారం విక్రయించబడును.

(6) ఆస్తి రిజర్వు ధరలో 5%కు సరిసమానమైన మొత్తం కోసం బయానా (EMD) మరియు టెండరు డాక్యుమెంట్‌ను సీల్డ్ కవర్‌లో ఉంచి "Offer for Purchase of Property" అని పెద్ద అక్షరాలతో దానిపై వ్రాసి శ్రీ నవీన్ కుమార్, APAC ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, ఆఫీస్ నం.501, 5వ అంతస్తు, సౌత్ అనెక్స్ టవర్ 2, వన్ వరల్డ్ సెంటర్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ పరేల్, ముంబయి – 400013 వారికి చేరేలా 01 అక్టోబర్, 2024న సా.5.00 గం.లకు లేదా అలోగా డిపాజిట్ చేయవలెను. బయానాను పైన తెలిపిన వివరాల ప్రకారం NEFT/RTGS ద్వారా చెల్లించవలెను. ముంబయి వద్ద చెల్లించబడేలా "APAC ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్" పేరున జాతీయ/ షెడ్యూల్డ్ బ్యాంక్ నుండి తీసిన డిమాండ్ డ్రాఫ్ట్ కూడా బయానాగా స్వీకరించబడును.

(7) గెలుపొందిన బిడ్డరు లెండర్ యొక్క అధీకృత అధికారి నుండి అమ్మకం నిర్ధారణ పొందిన మీదట 24 గంటలలోగా బయానాగా చెల్లించిన మొత్తాన్ని తగ్గించి ఆఫర్ మొత్తంలో 25%ను చెల్లించవలెను మరియు మిగిలిన 75% మొత్తం మరియు తుది మొత్తం(ఱు)ను లెండర్/ అధీకృత అధికారిచే అమ్మకం నిర్ధారణ తేదీ నుండి 15 (పదిహేను) రోజులలోగా చెల్లించవలెను. గెలుపొందిన బిడ్డరు పక్షాన ఏదైనా డిఫాల్టుకు పాల్పడితే, అప్పటి వరకు డిపాజిట్ చేయబడిన అన్ని మొత్తాలు బయానాతో సహా స్వాధీనం చేసుకోబడును. ఆదాయ పన్ను నియమాల ప్రకారం, కొనుగోలు ధర రూ. 50 లక్షల కంటే ఎక్కువ ఉన్నందున వేలం ధరలో 1% వంతున TDSను గెలుపొందిన వేలం కొనుగోలుదారు అదనంగా చెల్లించవలెను.

(8) ఇందులో పైన పేర్కొన్న షెడ్యూల్‌లో తెలిపిన సెక్యూర్డ్ ఆస్తులకు సంబంధించిన వివరాలు క్రింది సంతకందారు ఉత్తమ సమాచారం మరియు పరిజ్ఞానం మేరకు తెలియజేయబడినవి, అతను సదరు వివరాలలో ఏవేని తప్పు, తప్పుడు స్టేట్‌మెంట్ లేదా వదిలివేసిన దానికి బాధ్యత వహించరు. సెక్యూర్డ్ ఆస్తులు చట్టబద్ధ అథారిటీ (ఏదైనా ఉంటే)కి చెల్లించదగు బాకీల్లు రుణభారాలు మరియు బకాయిలతో విక్రయించబడతాయని మరియు టెండర్లు దాఖలు చేసే ముందు తమ స్వంత ప్రయోజనం మేరకు పైన తెలిపిన దానికి సంబంధించి మరియు పైన తెలిపిన సెక్యూర్డ్ ఆస్తులకు సంబంధించి ఇతర సంబంధిత వివరాలకు సంబంధించి తనంతట తాను/ తమంతట తాము/ దానంతట అది సంతృప్తి చెందవలసిందిగా టెండరుదారు(లు)/ ఆఫర్‌దారు(లు)/ కాబోయే బిడ్డరు(లు)/ కొనుగోలుదారు(లు)కు తెలియజేయడమైనది.

(9) తనిఖీ, వేలం యొక్క నియమ నిబంధనలకు సంబంధించి ఏవేని తదుపరి స్పష్టీకరణల కోసం సంప్రదించండి: యోగేశ్ బాబర్, లెండర్ యొక్క అధీకృత ప్రతినిధి, మొబైల్ నం.7208244190 లేదా శ్రీ నవీన్ కుమార్ ఎం., లెండర్ యొక్క అధీకృత అధికారికి naveen.kumar@apacfin.com/contactus@apacfin.com వద్ద వ్రాయవచ్చును.

(10) అధీకృత అధికారి ఎటువంటి తదుపరి నోటీసు లేకుండా లేదా కారణాలు తెలియజేయకుండా ఏవైనా లేదా అన్ని బిడ్లను తిరస్కరించు లేదా వేలంను రద్దు చేయు హక్కు కలిగి ఉన్నారు.

SARFAESI చట్టం, 2002లోని రూల్ 8(6) క్రింద చట్టబద్ధ 30 రోజుల అమ్మకం నోటీసు

ఇ–వేలం తేదీలోగా ఇప్పటి వరకు అయిన వడ్డీ మరియు అనుషంగిక ఖర్చులతో పాటు పైన తెలిపిన విధంగా మొత్తాన్ని చెల్లించవలసిందిగా రుణగ్రహీత/ గ్యారంటార్లు/ తనఖాదారు కోరబడుతున్నారు. లేనట్లయితే సదరు సెక్యూర్డ్ ఆస్తులు వేలం వేయబడును/ విక్రయించబడును మరియు మిగిలిన బకాయిలు ఏవైనా ఉంటే వడ్డీ మరియు వ్యయాలతో రాబట్టుకోబడును. ఏ కారణాల వలన అయినా వేలం విఫలమైతే SARFAESI చట్టం, 2002 క్రింద ఇచ్చిన నిబంధనల ప్రకారం రుణగ్రహీత/ గ్యారంటార్లు/ తనఖాదారుకి ఎటువంటి తదుపరి నోటీసు లేకుండా సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8లోని సబ్ రూల్ (5) క్రింద లేదా ఇతరత్రా ఏర్పాటు చేసిన విధంగా ప్రైవేట్ ఒప్పందం లేదా ఏదైనా ఇతరత్రా విధానాల ద్వారా పైన తెలిపిన సెక్యూర్డ్ ఆస్తులను విక్రయించేందుకు APAC ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ వారికి స్వేచ్ఛ కలదు.

తేది: 30 ఆగస్ట్, 2024
ప్రదేశం: కర్నూలు

APAC ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ తరపున
పేరు : శ్రీ నవీన్ కుమార్ ఎం.
హోదా: బిజినెస్ హెడ్ (అధీకృత అధికారి)

బైక్ అదుపు తప్పి వ్యక్తి దుర్మరణం

ప్యాపిలి: వంకమెట్టుపల్లి వద్ద గురువారం బైక్ అదుపు తప్పిన ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. అనంతపురం జిల్లా యాడికి మండలం వేములపాడుకు చెందిన చాకలి రాజు (40) తన ఇద్దరు మిత్రులతో కలసి బైక్‌పై కంబగిరి స్వామి ఆలయానికి వెళ్లాడు. అక్కడ బంధువుల పిల్లల కేశఖండన కార్యక్రమం చూసుకుని స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా వంకమెట్టుపల్లి వద్ద అదుపుతప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో చాకలి రాజుకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా ఇద్దరికి స్వల్ప గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం వారిని యాడికి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాచర్ల ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపారు.

మద్యం మత్తులో కత్తితో దాడులు

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలో మద్యం మత్తులో కత్తితో దాడులకు పాల్పడిన సంఘటనలు రెండు చోట్ల చోటుచేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బుధవారం అర్ధరాత్రి స్థానిక బొమ్మలసత్రం సమీపంలో స్నేహితులైన ట్రాక్టర్ డ్రైవర్లు ప్రకాష్, సుబ్బరాయుడు మద్యం సేవించారు. ఆ మత్తులో అప్పు విషయమై గొడవపడి సుబ్బరాయుడు తన వద్ద ఉన్న కత్తితో ప్రకాష్ కడుపులో పొడిచాడు. స్థానికులు చికిత్స నిమిత్తం గాయపడిన ప్రకాష్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అలాగే విశ్వనగర్‌కు చెందిన బుజ్జి అనే యువకుడు తన స్నేహితుడైన నందమూరినగర్‌కు చెందిన షేక్‌బషీర్‌తో కలిసి గురువారం సాయంత్రం మద్యం సేవించాడు. ఇద్దరి మధ్య మనస్పర్థల కారణంగా బుజ్జి తన వద్ద ఉన్న కత్తితో బషీర్ గొంతు కోశాడు. ఈ ప్రమాదంలో బషీర్ గొంతు భాగంలో తీవ్ర గాయం కావటంతో స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రెండు ఘటనలపై పోలీసులు విచారణ చేపట్టారు.

కర్నూలు పెద్దాసుపత్రిలో అరుదైన ఆపరేషన్

- మహిళకు గర్భంతో పాటు కణితులు
- రెండూ 9 నెలలు మోసిన గర్భిణి
- విజయవంతంగా ఆపరేషన్ చేసి తొలగించిన వైద్యులు


ఆపరేషన్ చేయించుకున్న మహిళతో వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): సాధారణంగా గర్భాశయంలో ఫైబ్రాయిడ్ కణితులు ఉంటే ఆ మహిళ గర్భం దాల్చడం జరగదు. కానీ ఆమె గర్భం దాల్చింది. పైగా గర్భంతో పాటు కణితులను ఆమె 9 నెలలు మోసింది. ఆమెకు ప్రసవం సమయంలో సిజేరియన్ ద్వారా బిడ్డను బయటకు తీయడమే గాక కణితులను తొలగించి విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల వైద్యులు. నంద్యాల జిల్లా బండి ఆత్మకూరుకు చెందిన 33 ఏళ్ల మహిళ వివాహమైన ఏడాదిన్నరకే గర్భం దాల్చింది. అయితే అదే సమయంలో ఆమె గర్భాశయంలో ఫైబ్రాయిడ్ కణితులు ఏర్పడ్డాయి. అప్పట్లో చిన్నగా ఉన్న కణితులు గర్భంతో పాటు పెరగడం ప్రారంభించాయి. 9 నెలలు గడిచాక ఒక కణితి 2 కిలోలు, మరో కణితి 800 గ్రాముల చొప్పున పెరిగాయి. ప్రసవం తేదీ దగ్గర పడటంతో ఆమె సమీపంలోని ఆసుపత్రిలో చేరాలని ప్రయత్నించింది. అయితే ఆమెకు ఆపరేషన్ చేసేందుకు ఏ ఆసుపత్రిలోనూ ఏ ఒక్కరూ ముందుకు రాలేదు. చివరకు ఆమె ఈ నెల 13వ తేదీన కర్నూలు పెద్దాసుపత్రిలో చేరగా 20వ తేదీన ఆమెకు సిజేరియన్ ద్వారా వైద్యులు ప్రసవం చేశారు. అరుదైన ఈ శస్త్రచికిత్స నిర్వహించిన వారిలో గైనకాలజీ మొదటి యూనిట్ ప్రొఫెసర్, హెచ్‌వోడీ డాక్టర్ శ్రీలక్ష్మి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉమాదేవి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నర్మద, అనెస్తీషియా ప్రొఫెసర్ డాక్టర్ సుధీర్, డాక్టర్ మురళీప్రభాకర్, డాక్టర్ రేణుక ఉన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఇది చాలా అరుదైన కేసు అన్నారు. ఇలాంటి చికిత్సను సిజేరియన్ మయోమెక్టమి అంటారని తెలిపారు. చాలా క్లిష్టమైనదని, సిజేరియన్ సమయంలో రక్తస్రావం అధికంగా ఉంటుందని కాబట్టే ఏ ఆసుపత్రిలోనూ ఆమెను చేర్చుకోక ఇక్కడకు పంపించారని తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ 22సెంట్లు 7.50లక్షలకే 96 శ్రీగంధం మొక్కలతో ప్రకాశం జిల్లా, అద్దంకి దగ్గర పూర్తి డెవలప్‌మెంట్స్‌తో శ్రావణమాసం ఆఫర్ బ్యాంకాక్ ట్రిప్ (6 రోజులు) సం.ప్ర॥ ✆ 9523456789 [B-1248571]

SERVICES

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647. [V-6552]

WANTED

■ కర్నూలు నందు గల ఒక హాస్పిటల్ క్యాంటీన్ నందు టీ & కాఫీ తయారు చేయడంలో మాస్టర్‌గా అనుభవము ఉన్న వారు పనిచేయుటకు కావలెను. ఆసక్తి గల వారు సంప్రదించండి. సెల్: 7892686064. [L-783307]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ ఆఫీస్‌లో పని చేయుటకు అకౌంటెంట్ కావలెను. Qly: B.Com with Tally, 2 Years Exp. in any organisation సంప్ర: కర్నూలు. 80743 99570 [L-783306]

■ Work From Home AP TS News యాప్‌లో వర్క్ ఫ్రం హోం జాబ్స్ ఫ్రీగా ట్రైనింగ్ ఇచ్చి జాబ్ ఇస్తాం. ఫిమేల్ టెలికాలర్ జీతం 15 వేలు – 30 వేలు. కావలెను. సెల్: 99666 76646. [L-794909]

■ మీ ఇంటివద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి న్యూ రికార్డ్స్ రాయటం స్త్రీ పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం 12,000/-. ఫోన్ : 70756 56208 [V-6551]

■ కన్సల్టెన్సీ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు, ఆయా, నర్సులు, వంటచేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ. 15 వేలు-40 వేలు, ఫ్రీ రూమ్+భోజనం, HYD. ఫోన్ 6309020999 [HA-98313]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

